ప్రజాశక్తి

శుక్రవారం 23 మే 2025 5

పార్వతీపురం మన్యం

కలెక్టర్‌ను కలిసిన జిసిసి డిఎం రామారావు

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన సహకార సంస్థ (జిసిసి) జిల్లా అధికారిగా బాధ్యతలు స్వీకరించిన జె.రామారావు గురువారం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్‌ను గౌరవ పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందచేసిన మాట్లాడారు.

కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌కు పూల మొక్కను అందజేస్తున్న జిసిసి డిఎం రామారావు

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలోని వివిధ దశల్లో ఉన్న పిఎం జన్‌మన్ గృహ నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మండలంలోని చప్పవానివలసలో గురువారం పర్యటించి వివిధ దశలో ఉన్న ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. గృహ నిర్మాణాల జాప్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్న కలెక్టర్ పనులను మరింత వేగవంతంగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రెండో విడత బిల్లులు మరి కొద్ది రోజుల్లో మంజూరు కానున్నాయని, కావున వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గృహ నిర్మాణాల సామగ్రి అందుబాటులో ఉన్నదీ లేనిదీ ఆరా తీసిన ఆయన పనులకు ఆటంకం లేకుండా అవసరమైన సామాగ్రిని ముందుగానే అందుబాటులో ఉంచుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో గహ నిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అధికారి జి.సోమేశ్వరరావు, చిరంజీవి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పి.ఎస్.నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల లబ్ధికి రైతులు సంఘాలుగా ఏర్పడాలి

ప్రభుత్వం అమలు చేస్తోన్న పథకాల రాయితీలు, రుణాలు వర్తించేలా సంఘాలుగా ఏర్పడాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ రైతులకు పిలుపు నిచ్చారు. మండలంలోని వెలగవలసలో రైతులతో ముఖా ముఖి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ముచ్చటించారు. నిమ్మగడ్డి సాగు, దిగుబడి, ఆదాయం, సాగులోని ఏమైనా సమస్యలు ఉన్నాయా అన్న అంశాలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు సంఘాలుగా ఏర్పడి రైతులు, ప్రభుత్వం చెరి సగం సహకారంతో నీటి బావులు తవ్వించి సోలార్ విద్యుత్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని సూచించారు. ఉపాధి హామీ కింద నిమ్మగడ్డి సాగు చేసుకొనే అవకాశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. ఆయిల్ ఉత్పత్తికి అవసరమైన బాయిలర్లను ఏర్పాటుకు రైతుల భాగస్వామ్యం అవసరమన్నారు. గ్రామంలో వలసలపై ఆరా తీసిన వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు అందుతున్న విషయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నూజివీడు సీడ్స్ సంపద రకం వరి విత్తనాలను సరఫరా చేయాలని రైతులు కోరగా, తక్షణమే స్పందించి వ్యవసాయ శాఖ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. అదే రకమైన 1318 విత్తనాలు అందుబాటులో ఉన్నందున సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దాలమ్మ, జిల్లా ఉద్యానవన అధికారి బి.శ్యామల, ఎంపిడిఒ జి.రమేష్ బాబు, ఉద్యానవన అధికారి ప్రియాంక, పంచాయితీ కార్యదర్శి వి.భార్గవ్, ఫీల్డ్ అసిస్టెంట్ పి.నూకరాజు, పంచాయతీ కార్యదర్శి వి.భార్గవ్, తదితరులు, పాల్గొన్నారు.

ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ఆరని విద్యుత్ మంటలు

కరెంటు కోసం కొనసాగుతున్న నిరసనలు
కలెక్టర్ స్పందించాలి : సిపిఎం

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని విద్యుత్ మంటలు కొనసాగుతూనే ఉన్నాయి. పండగ ముగిసినా విద్యుత్ సరఫరా పునరుద్ధరించకపోవడంతో పట్టణ వాసులు ఎక్కడికక్కడ వివిధ రూపాల్లో గురువారం నిరసన తెలిపారు. పట్టణంలోని మజ్జులపేట, తోటవీధి, బోనువీధి, గొడగలపేట వాసులు నిరసన తెలిపారు. మజ్జులపేట ప్రజలు మోసూరు రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. జనసేన కౌన్సిలర్ రాపాక మాధవరావు ఆధ్వర్యాన స్థానికులు రహదారిపై బైఠాయించి వాహనాల రాకపోకలు అడ్డుకున్నారు. అధికారుల వైఫల్యం కారణంగానే పట్టణ ప్రజలకు కరెంటు కష్టాలు ఎక్కువయ్యాయని విమర్శించారు. అలాగే తోటవీధి వాసులు ఎఇ కార్యాలయాన్ని ముట్టడించారు. బోనేవీధి, అక్కేన వీధి వాసులు వాహనాల బోసు బొమ్మ జంక్షన్ వద్ద వాహనాల టైర్లను కాలుస్తూ నిరసన తెలిపారు. పండగ అనంతరం పరిస్థితిని సమీక్షించాల్సిన పాలకులు, అధికారులు ఏమీ పట్టనట్టు వ్యవహరించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని విద్యుత్ సమస్యలపై కలెక్టర్ స్పందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్‌వై నాయుడు కోరారు. విద్యుత్ లేక ప్రజలు పడుతున్న అవస్థలపై అధికారులతో సమీక్షించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రోడ్డుపై బైఠాయించిన మజ్జులపేట వాసులు

బోసు బొమ్మ జంక్షన్ వద్ద టైర్లు కాలుస్తూ నిరసన తెలుపుతున్న బోనివీధి వాసులు

చెరువుల ఆక్రమణలను తొలగించాలి

డిఆర్‌ఒకు ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వినతి

ప్రజాశక్తి - పార్వతీపురం

పట్టణంలోని దేవునిబంధ, కామయ్య బంధ, నెల్లిచెరువు, వరహాలు గెడ్డ తదితర చెరువులు, ఆక్రమణలకు గురయ్యాయని, వెంటనే వాటిని తొలగించే ప్రక్రియ చేపట్టాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి డిఆర్ఓ కె.హేమలతను కోరారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో ఆమెకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ పట్టణంలో సాగు, తాగు చెరువులు, గెడ్డలన్నీ కబ్జాలకు గురైనట్టు స్పష్టంగా కనిపిస్తున్నా రెవెన్యూ అధికారులకు పట్టకపోవడం విడ్డూరమన్నారు. గతంలో అందించిన ఫిర్యాదుల మేరకు దేవుని బంద ఆక్రమణలు జరిపి ఇళ్లు కట్టిన చోటే మార్కింగ్ కూడా ఇచ్చారని, అలాగే వరహాల గెడ్డ ఆక్రమించి భవనాలు నిర్మించిన 24 మందికి నోటీసులు ఇచ్చారని, కానీ ఇంతవరకు ఎటువంటి తొలగింపు చర్యలు తీసుకోకపోవడం అన్యాయమని మండిపడ్డారు. పెరుగుతున్న పట్టణానికి పార్కులు కావాలని, ప్రజలు సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు స్థలాలు అవసరమని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులకు, విద్యాసంస్థల నిర్మాణాలకు భూముల అవసరం ఉందన్నారు. కబ్జాలను తొలగించినట్లయితే చాలా భూములు ప్రభుత్వ ఆధీనంలో ఉంటాయని తెలిపారు. ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడే చెరువులను, గెడ్డలను, భూములను కబ్జాలు చేసి, వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. ఇకనైనా దేవునిబంద, కామయ్య బంద, నెల్లిచెరువు వరహాల గెడ్డ తదితర చెరువుల ఆక్రమణలను తొలగించి ప్రజా ప్రయోజ నాల కోసం ఉపయోగించాలని, లేకుంటే భవిష్యత్తు లో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

డిఆర్‌ఒకు వినతిని అందజేస్తున్న రైతు సంఘం జిల్లాఅధ్యక్షులు కృష్ణమూర్తి

కెసిసి రుణాలపై బ్యాంకర్లు స్పందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో కిసాన్ క్రెడిట్ కార్డులు (కేసీసీ) రుణాలపై బ్యాంకర్లు తక్షణమే స్పందించాలని, లేకుంటే ఉపేక్షించబోమని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ స్పష్టం చేశారు. కెసిసిలో వచ్చిన దరఖాస్తులన్నీ 15 రోజుల్లోగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బ్యాంకర్లకు నిర్దేశించిన లక్ష్యాలు సకాలంలో సాధించాలని, అందుకు తగిన విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బ్యాంక్ అధికారులు, పలు శాఖల అధికారులతో డిసిసి, జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ 2024 సంవత్సరానికి తీసుకున్న పంట రుణాలు తిరిగి చెల్లించిన రైతులకు ఈ ఏడాది రుణాలు మంజూరు చేయాలన్నారు. మైక్రో ఫుడ్ ప్రోసెసింగ్ ఎంటర్ప్రైజెస్ పథకం కింద యువత ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పేందుకు ఊతమివ్వాలన్నారు. పిఎం స్వానిధి, మత్స్యకారుల వీధి వ్యాపారులకు రుణాలు, ముద్రా రుణాలు మంజూరులో కొన్ని బ్యాంక్‌లు వెనుకబడి ఉన్నందున త్వరితగతిన లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంప్లాయిమెంట్ డెవలప్మెంట్‌పై యువతకు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు సకాలంలో అందించడం, లక్ష్యాలను అధిగమించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని బ్యాంక్ అధికారులను ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన, పశు సంవర్ధక శాఖల అధికారులు బి.శ్యామల, డా.ఎస్.మన్మథరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎన్.విజయ్ స్వరూప్, డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణి, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ ఎం.వి.కరుణాకర్, డిసిసిబి బ్యాంక్ సిఇఒ సిహెచ్.ఉమా మహేశ్వరరావు, జిల్లా సహకార శాఖ అధికారి పి.శ్రీరామమూర్తి, ఎఎల్డిఎమ్ కె.మౌనిక, ఇతర బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

26న సీతంపేటలో గ్రీవెన్స్

పార్వతీపురం : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) ను సోమవారం సీతంపేటలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన జారీ చేశారు. సోమవారం ఉదయం 10గంటల నుంచి సీతంపేట ఐటిడిఎ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు తమ సమస్యలను సీతంపేటలో సమర్పించవచ్చని ఆయన పేర్కొన్నారు. జిల్లా అధికారులంతా సీతంపేటలో జరిగే పిజిఆర్ఎస్‌కు హాజరు కావాలని ఆయన ఆదేశించారు.

ధర్నాను జయప్రదం చేయండి

సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు

ప్రజాశక్తి - కొమరాడ

పూర్ణపాడు - లాబేసు వంతెన పెండింగ్ పనులు ప్రారంభించాలని ఈనెల 26న స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద జరుగు ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ప్రజలకు పిలుపునిచ్చారు. ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం నాగావళి ఆవతల గ్రామాలైన కొట్టు, తొడుము, రాయిపురం, తులసివలస, బంధవలస, తాడంగివలస, పూజారి గూడ, కుంభకోట, రావికోన, కర్లగండ, పాలెం, చెక్కవలస, మాదలింగి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పూర్ణపాడు-లాబేసు వంతెన కడతామని హామీ ఇచ్చినప్పటికీ గెలిచిన తర్వాత ఏడాదైనా కనీసం ఈ వంతెన వైపు చూడండి పరిస్థితి ఉందన్నారు. పాలకులు అధికారంలో ఉండేటప్పుడు ఒక మాట, ప్రతిపక్షంలో మరో మాట ధర్నాలకు, రాస్తారోకులకు రిలే నిరాహార దీక్ష వద్దకు వచ్చి ఒక మాట మాట్లాడుతూ గిరిజన ఓట్లు దండుకుంటున్న పదవులు పొందిన తర్వాత ఈ వంతెన పూర్తి చేయడంలో పూర్తిగా పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. కురుపాం నియోజకవర్గానికి సంబంధించిన ఐదు మండలాలకు ఉపయోగకరమైందని, ఇలాంటి వంతెనను పాలకులు పట్టించుకోకుండా వదిలేయడం సరికాదని, కావున ఈ వంతెనను సాధించుకునే దిశగా పార్టీలకు అతీతంగా అన్ని ప్రజా సంఘాలు, గిరిజన సంఘాలు ఏకమై ఈనెల 26న స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద తలపెట్టిన ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, గిరిజన సంఘం నాయకులు రామారావు, సీతారాం పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలని గ్రామస్తులతో మాట్లాడుతున్న గంగునాయుడు

కమ్యూనిస్టు ఉద్యమ చైతన్య పతాక పర్సా

ప్రజాశక్తి - బలిజిపేట

కార్మిక నేత, కమ్యూనిస్టు ఉద్యమ చైతన్య పతాక పర్సా సత్యనారాయణ అని సిటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు కొనియాడారు. గురువారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో పర్సా సత్యనారాయణ వర్ధంతి సభ జరిగింది. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం మన్మధరావు మాట్లాడుతూ పర్స సత్యనారాయణ భారత కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రముఖ నాయకుడిగా ప్రసిద్ధిగాయించారని, 19ఏళ్లలోనే కమ్యూనిస్టు ఉద్యమంలో చేరి నైజం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి సాయుధ పోరాటానికి సిద్ధం చేశారని తెలిపారు. పాలవంచ ఏరియా దళ కమాండర్‌గా పనిచేసి నిజాం అకృత్యాలపై పోరు నడిపారన్నారు. సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమర శంఖం పూరించి వారికి బాసటగా నిలిచారని, అనంతరం సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ స్థాపించారని తెలిపారు. కార్మికుల జీవితాలు మార్పు కోసం అనేక పోరాటాలు నిర్వహించి కార్మికు శ్రేయస్సు కోసం పాటుపడిన నాయకులు పర్సా సత్యనారాయణ అన్నారు. సిఐటియు అఖిలభారత ఉపాధ్యక్షునిగా పనిచేసి కార్మిక చట్టాలుఆయన ఆశయాలను ముందుకు తీసుకుపోవడమే ఆయనకు నిజమైన నివ్వాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నల్ల ఈశ్వరరావు, ఆటో యూనియన్ నాయకులు సీతారాం, భాస్కరరావు, జ్యోతి, భాగ్యం, సుధా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పర్సా సత్యనారాయణకు నివాళ్లు అర్పిస్తున్న కార్మికులు, స్కీం వర్కర్లు

ఇవిఎం గోదామును తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక ఎఎంసి వద్ద గల ఇవిఎం గోదామును జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీలో భాగంగా గురువారం ఆయన గోదాములను సందర్శించి అక్కడ పరిస్థితిని గమనించారు. గోదాములకు వేసిన సీళ్లను ఇవిఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిష్టరులో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. గోదాముల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశిస్తూ, ఏర్పాట్లపై పరిశీలించి అధికారులకు పలు సూచనలు, మార్గదర్శకాలు జారీ చేశారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, తహసీల్దార్ వై. జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎం మెచ్చిన 'బడి నుంచి పొలం బడికి'

ప్రజాశక్తి -గరుగుబిల్లి

విజయవాడ లోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అటవీ పర్యావరణ శాఖ నిర్వహించిన బయోడైవర్సిటీ సదస్సులో పార్వతీపురం మన్యం జిల్లా నుంచి జట్టు ట్రస్ట్ ఏర్పాటు చేసిన బడి నుండి పొలం బడికి స్టాల్‌ను డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ సందర్శించి అభినందించారు. జిల్లాలో అమలవుతున్న ఈ కాన్సెప్ట్ తనకు నచ్చిందని, దీనిపై మరింత చర్చించడానికి తన కార్యాలయానికి రావాల్సిందిగా ఆహ్వానించినట్లు జట్టు వ్యవస్థాపకులు డి.పారినాయుడు తెలిపారు. మనబడి -మనతోట పేరుతో కలెక్టర్ సహకారంతో జట్టు ట్రస్ట్ 200 పాఠశాలల్లో శిక్షణా కార్యక్రమం నిర్వహించడం, ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక పుస్తకాలను ప్రచురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న విషయం తెలిసిందేనని అన్నారు. విద్యార్థులు ఆడుతూ, పాడుతూ బడి తోటలో కూరగాయలు, పండ్లు, పూలు పండిస్తూ వ్యవసాయం పట్ల అవగాహన చేసుకుంటున్నారని జట్టు సభ్యులు పవన్ కళ్యాణ్‌కు వివరించారు. జట్టు ట్రస్ట్ డిప్యూటీ సిఇఒ ఎం నూకం నాయుడు, ట్రస్ట్ డెవలప్మెంట్ మేనేజర్ డి.నవజీవన్ జట్టు చేపడుతున్న కార్యక్రమాలను డిప్యూటీ సీఎంకు వివరించారు.

బడినుంచి పొలంబడి స్టాల్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

చెడ్డ పేరు తెస్తే చర్యలు : జిసిసి చైర్మన్

ప్రజాశక్తి- పార్వతీపురం

జిసిసిలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొస్తే చర్యలు తీసుకుంటామని రాష్ట్ర జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ హెచ్చరించారు. గురువారం ఆయన స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్రతో కలిసి డివిజన్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ఎవ్వరూ చెడ్డ పేరు తెచ్చే విధంగా పనిచేయవద్దని కోరారు. ఒకవేళ ఎవరైనా చెడ్డ పేరు తెస్తే కచ్చితంగా చర్యలు తప్పవని, ప్రతి హాబిటేషన్లో రైతులకు, ప్రజలకు జీసిసి ద్వారా నిత్యవసర సరుకులు అందించే కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. కాంట్రాక్టు ఉద్యోగుల విషయంపై ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్ళినట్లు చెప్పారు. జిసిసి నుండి అందిస్తున్న సరుకులు నేరుగా ప్రజలకు అందలేలా చూడాలన్నారు. జిసిసి ఉద్యోగులలో అనేకమందికి ప్రమోషన్స్ ఇచ్చామని, ఒకటో తారీకు నుండి అన్ని డిఆర్డిపోల్లో జిసిసి ద్వారా ప్రజలకు నిత్యవసర సరుకులు అందిస్తామని చెప్పారు. అరుకు కాఫీని అంతర్జాతీయ స్థాయికి ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకువెళ్లారని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, టిడిపి నాయకులు పాండురంగ స్వామి, సుబ్బారావు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గొట్టాపు వెంకటనాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.రవికుమార్, మండల అధ్యక్షుడు బోను చంద్రమౌళి, బోను దేవి, రౌతు వేణుగోపాల్ నాయుడు, సీతానగరం తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందికి సూచనలు చేస్తున్న జిసిసి చైర్మన్ శ్రావణ్‌కుమార్

మున్సిపల్ కార్మికుల నిరసన

పాలకొండ : స్థానిక నగర పంచాయతీ ప్రజారోగ్య విభాగంలో ఔట్సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తూ వివిధ కారణాల వల్ల ఖాళీ అయినా పోస్టుల్లో కరోనా కాలంలో పనిచేసిన పారిశుధ్య కార్మికుల్ని నియమించాలని, స్థానిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని చేయాలని కోరుతూ ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద, మస్తర్ పాయింట్లు వద్ద కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ పాలకొండ కమిటీ గౌరవ అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ నగర పంచాయతీలో ప్రజా రోగ్య విభాగంలో పనిచేస్తున్న వివిధ కారణాల వల్ల ఖాళీ అయిన పోస్టులో చేతివాటంతో కొత్త వారిని నియమిస్తున్నట్టు ఫిర్యాదులు, ఆరోపణలు వస్తున్నాయని, వీటిపై సమగ్ర విచారణ జరపాలని అన్నారు. పాలకొండ జనాభా ప్రాతిపదికన పారిశుధ్య కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. పాలకొండలో సంపూర్ణ పారిశుధ్యానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. డంపింగ్ యార్డ్ సమస్య తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. స్థానిక సమస్యల పరిష్కారానికి కార్మిక సంఘాలతో అధికారులు జాయింట్ సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సి.హెచ్ సంజీవి, రఘు, శ్రీదేవి, విమల, వి.ఆంజనేయులు పాల్గొన్నారు.

నగర పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

పోలీసు కస్టడీకి సిరాజ్, సమీర్

- వారం రోజుల పాటు అప్పగింత
- సిరాజ్‌కు డిసిసిబిలో బ్యాంకు ఖాతాలు
- లోతుగా ఎన్ఐఎ విచారణ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఉగ్రకుట్రలకు పాల్పడిన సిరాజ్, సమీర్‌ను వారం రోజుల పాటు పోలీసు కస్టడీ ఇస్తూ విజయనగరం కోర్టు తీర్పునిచ్చింది. ఉగ్రకుట్రలపై సిరాజ్, సమీర్‌ను పోలీసులు పూర్తి స్థాయిలో విచారించే అవకాశం ఉంది. దీంతో వారి 'ఉగ్ర' ప్రణాళికలు బయట పడే అవకాశం ఉంది. పేలుళ్లకు ఉపయోగపడే వస్తువులను కొనుగోలు చేసిన కె.ఎల్.పురం, కన్యకా పరమేశ్వరి కోవెల ప్రాంతాల్లో షాపుల్లో ఎన్ఐఎ అధికారులు విచారణ చేశారు. అన్ని కోణాల్లోనూ పోలీసులు, ఎన్ఐ అధికారులు విచారణ చేపడుతున్నారు. డిసిసిబిలో సిరాజ్ బ్యాంక్ అకౌంట్‌కు రూ.42 లక్షలు ఎలా వచ్చాయనే వివరాలపై పోలీసులు ఆరా తీసే అవకాశం ఉంది.

విజయనగరంలో సిరాజ్, హైదరాబాద్‌లో సమీర్‌ను అదుపులోకి తీసుకోవడంతో ఉగ్ర కుట్ర బయటపడిన విషయం తెలిసిందే. విజయనగరానికి చెందిన సిరాజ్ ఉర్ రెహ్మాన్ జీవితం.. ఒక సాధారణ యువకుడి ప్రయాణంలా మొదలైంది. చివరికి మతోన్మాదిగా మార్చేసింది. మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసి, ఎస్ఐ, గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమవుతూ హైదరాబాద్‌లో 108 అంబులెన్స్ సర్వీసులో టెలీకాలర్‌గా పనిచేసేవాడు. బోయగూడకు చెందిన సయ్యద్ సమీర్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. అదే అతని జీవితాన్ని ఎడారిలోకి నెట్టేసింది. అక్కడే జీహాది గురించి ఇద్దరూ చర్చించుకోవడం, చివరికి మతోన్మాదిగా మారానని చెప్పడం చూస్తుంటే ప్రసంగాలతో ఉగ్రవాద సంస్థలు యువతకు ఎలా వల వేసి, ఉచ్చులోకి లాగుతున్నాయో అర్థమవుతోంది.

జీహాదిపై సమీర్ మరింత ఆకర్షితుడయ్యాడు. సిరాజ్ వరంగల్‌కు చెందిన పరహాన్ మొయిన్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన బాదర్ వంటి మిగతా ఉగ్రవాదులతో ఏర్పడిన పరిచయాలు మరింత ముంచేశాయి. ఒమన్‌లోని హైదరాబాద్ వాసి ఇమ్రాన్ అక్రమ్ మార్గదర్శకత్వంలో పేలుడు పదార్థాల కొనుగోలు, వాటిని ఉపయోగించి ఐఇడి బాంబులు తయారీకి సిద్ధమయ్యాడంటే, ఎంతలా ఉగ్రవాదం వైపు ఆకర్షితుడయ్యాడో అర్థం చేసుకోవచ్చు. ఈ బాంబులను జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పేల్చాలని ప్రణాళిక రూపొందించేలా చేశారు.

అధునాతన సాంకేతికత

ఉగ్ర చర్యల గురించి ఎవరికీ తెలియకుండా సిరాజ్ సిగ్నల్ యాప్‌ను ఉపయోగించినట్లు సమాచారం. సిరాజ్ ఇతరులతో తరచూ ఈ యాప్ ద్వారానే చర్చించి, కుట్రలకు పన్నాగాలు పన్నాడు. సౌదీ కేంద్రంగా హ్యాండ్లర్లు వీరిద్దరితో తరచూ సంప్రదింపులు జరిపారు.

ఉగ్ర కుట్రలపై డేగ కన్ను

ఉగ్రసంస్థలు యువకులను లక్ష్యంగా చేసుకుంటూ ఆర్థికంగా ముట్టజెపుతూ ఉచ్చులోకి లాగుతున్నాయి. సిరాజ్‌కు సౌదీ నుంచే ఆర్థిక లావాదేవీలు జరిగాయని ప్రాథమికంగా ఆధారాలు సేకరించారు. సిరాజ్ కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాలపై దృష్టి పెట్టింది. సిరాజ్‌కు డిసిసిబిలో ఉన్న బ్యాంకు ఖాతాల్లో రూ.42 లక్షలు ఉన్నట్లు గుర్తించారు. సిరాజ్ తండ్రికి ఇదే బ్యాంకులో లాకర్ కూడా ఉన్నట్లు గుర్తించారు. వీటిని తెరవడానికి అనుమతులు అధికారులు కోరారు. తండ్రి, సోదరుడితోపాటు సమీప బంధువుల ఖాతాల్లోకి సిరాజ్ ఖాతాల నుంచి డబ్బులేమైనా వెళ్లాయా? లనే కోణంలో దర్యాపు సాగుతోంది. ఉగ్ర కుట్రలపై దర్యాప్తు సంస్థ.. ఎన్ఐఎ డేగ కన్ను పెట్టింది. సిరాజ్ పరిచయాలపైనా ఆరా తీస్తోంది. ఏ చిన్న విషయాన్నీ విడిచిపెట్టడం లేసదు. సిరాజ్ చదువుకున్న నెల్లిమర్ల, గజపతినగరం, విజయనగరం, కొత్తవలసలో విస్తృతంగా పర్యటిస్తూ వివరాలను సేకరిస్తోంది.

మరోవైపు వారం రోజులపాటు పోలీసు కస్టడీకి సిరాజ్, సమీర్‌ను అప్పగిస్తూ విజయనగరం కోర్టు తీర్పునివ్వడంతో పోలీసులు మరిన్ని వివరాలు రాబట్టే అవకాశం ఉంది.

విక్రంపురంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని విక్రంపురం గ్రామంలో గురువారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, గర్భిణులు, మధుమేహ, రక్తపోటు, తదితర రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం, ఆశ కార్యకర్తలు, 104 సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

రెండో వైద్యాధికారిగా శివాజీనాయుడు

ప్రజాశక్తి - మక్కువ

మండల కేంద్రంలోని ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రెండవ వైద్యాధికారిగా డాక్టర్ శివాజీనాయుడు నియమితులయ్యారు. గురువారం ఆయన ఉద్యోగ బాధ్యతలను మక్కువ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వీకరించారు. గతంలో పాడేరు ఆస్పత్రిలో పనిచేసిన ఆయన డాక్టర్ నిఖిల స్థానం ఖాళీ కావడంతో ఇక్కడకు వచ్చారు.

ముమ్మరంగా ఉపాధి పనులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని యు.వెంకంపేట, తూడి, యం.రాజపురం, కడకల్లా, చిట్టిపూడివలస తదితర గ్రామాల్లో ఉపాధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. వర్షాలు పడటం వల్ల మెత్తగా మట్టి రావడంతో అధిక సంఖ్యలో కూలీలు పాల్గొంటున్నారు.

ఉపాధి పనులను పరిశీలించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని సూరంపేట గ్రామాలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపిడిఒ ఎంఎస్ఎన్ ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి కూలీల మస్తరులను వెరిఫికేషన్ చేసి వారి పేర్లను చదివారు. ప్రభుత్వం నిర్ణయించిన సమయంలో నిర్దేశించిన కొలతలు మేరకు వేతనదారులు పనిచేయాలని, ప్రతి ఒక్కరూ వడదెబ్బకు గురికాకుండా ఉండాలని పనులు చేసే ప్రదేశాలలో టెంట్లు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ ఉపాధి కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎఫ్‌పిఒ ద్వారా పైనాపిల్‌కు మద్దతు ధర

ప్రజాశక్తి- సీతంపేట

ఎఫ్‌పిఒ ద్వారా నెల రోజులు ముందుగానే పైనాపిల్‌కు మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తున్నామని చైర్మన్ కొండంగి గణపతిరావు, సవర సూర్య, సిఇఒ గణేశ్వరరావు తెలిపారు. జై ఆదివాసి ఉద్యాన, వ్యవసాయ అనుబంధ ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం వాళ్ల కడగండి రోలు, గుడ్డి కుమ్మరి గండి పంచాయితీల్లో 215 మంది రైతులు నుంచి సుమారు 32 వేలు పైనాపిల్ కాయలు ఒక్కొక్కటి 15 రూపాయలు చొప్పున కొనుగోలు చేశారు. ఈ కొనుగోలు చేసిన పైనాపిల్ కాయలను ఒడిషా రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న పండగలలో భాగంగా అక్కడ అమ్మకాలు చేస్తామన్నారు.

ఆ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లావ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్లు చేస్తూ రానున్న విద్యా సంవత్సరం ఫీజు ఇప్పుడే కట్టించుకుంటున్న వ్యవహారంపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టి.అఖిల్ డిమాండ్ చేశారు. గురువారం పార్వతీపురం స్థానిక సుందరయ్య భవనంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల యజమానులు విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రూ.2వేలు నుంచి రూ.5 వేల రిజర్వేషన్ డబ్బులు వసూళ్లు చేస్తూ, పుస్తకాలు కొనుక్కోవాలని ఆదేశాలు జారీ చేస్తున్నారని మండిపడ్డారు. ఎక్కడా లేనివిధంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యా సంవత్సరం ప్రారంభం కాకమునుపే డబ్బులు వసూలు చేస్తూ, పుస్తకాలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేయడం అన్యాయమన్నారు. ప్రతి కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న చిన్నాచితక ఉద్యోగస్తులను ఎండలను సైతం లెక్కచేయకుండా ప్రవేశాల కోసం ఇంటింటికీ తిప్పుతున్నారన్నారు. అడ్మిషన్లు ప్రారంభిస్తున్నప్పటికీ జిల్లాలో అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడం అన్యాయమన్నారు. తక్షణమే ముందస్తు అడ్మిషన్లు ఆపాలని, పుస్తకాలు, రిజర్వేషన్ ఫీజులను వసూలు చేస్తున్న అన్ని రకాల విద్యాసంస్థలపై దర్యాప్తు చేసి తక్షణమే అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు సురేష్, సాలూరు మండల కమిటీ సభ్యులు సందీప్, లక్ష్మణ్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎండియు వ్యవస్థను కొనసాగించాలి

ప్రజాశక్తి- సీతంపేట

ఇంటింటి రేషన్ విధానం ఎత్తి వేసి మరల డిపోలు ద్వారా రేషన్ ఇస్తామని కూటమి ప్రభుత్వం చెప్పడం ప్రజలకు ప్రధానంగా గిరిజన ప్రాంతం వారికీ మరీ ఇబ్బందులు పడతారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు అన్నారు. ఎన్నిక హామీలు అమలు చేయకుండా ఉన్న పద్ధతులు మార్పులు చేయడం అంటే తామేదో చేస్తున్నామని ప్రజలకు భ్రమలు పెట్టడం తప్ప ఉపయోగం ఉండదన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి- సీతంపేట

33/11కెవి సీతంపేట సబ్ స్టేషన్‌లలో నిర్వహణ పనులు నేపథ్యంలో శుక్రవారం మండలంలో పలు ప్రాంతాల్లో విద్యుత్తు అంతరాయం ఏర్పడనుందని ఎలక్ట్రిక్ డిఇ విష్ణుమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుండి సాయంత్రం 12గంటల మధ్య విద్యుత్తుకు అంతరాయం ఏర్పడనుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

'టిడిపి గరుగుబిల్లి మండల కన్వీనర్‌గా నారాయణస్వామిని నియమించాలి'

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గరుగుబిల్లి టిడిపి మండల కన్వీనర్‌గా మరడాన నారాయణస్వామి నియమించాలని కోరుతూ గుమ్మలక్ష్మీపురం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి మండల తెలుగు యువత సభ్యులు వినతి అందించారు. నారాయణస్వామిని కన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని ప్రతి పంచాయతీలో తీర్మానం చేసుకున్నామని తెలిపారు. మీరు పరిశీలించి అవకాశం ఇవ్వాలని వారు కోరారు.

ఉదయం ఎండ.. మధ్యాహ్నం వర్షం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఉదయం వేళ మండుటెండలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న ప్రజలకు మధ్యాహ్నం వేళల్లో కురుస్తున్న వర్షంతో ఉపశమనం పొందుతున్నారు. ఏజెన్సీలో గత మూడు రోజులుగా ఉదయం ఎండ.. మధ్యాహ్నం వర్షం కురుస్తోంది. గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉరుములు మెరుపులు పిడుగులతో సుమారు గంట పాటు కురిసిన వర్షంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ప్రధాన రహదారి పై నీరు చేరింది. కురుస్తున్న వర్షాలతో ఖరీఫ్ పనులకు అనుకూలంగా ఉంటుందని ఏజెన్సీ రైతులు భావిస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - కురుపాం

గడ్డి మందు తాగి గిరిజనుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మండలంలో గొటివాడలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. తిమ్మక శ్రీనివాస (40) గురువారం ఉదయం గడ్డి మందు తాగి అపస్మారక స్థితికి వెళ్లడంతో వెంటనే కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురంలో నిర్మాణంలో ఉన్న ఎస్‌బిఐ ఎటిఎం సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఎర్త్‌వైర్ బయటకు వదిలేయడంతో నీటిలోకి ప్రవహించిన విద్యుత్ సరఫరా అటుగా వెళ్తున్న ఆవుకు తగలి గురువారం రాత్రి మృతి చెందింది. ఆ ప్రాంతంలో ప్రజలు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మొన్న అమ్మవారి ఘటాలు తిరిగే టైంలో వర్షానికి ఆ పరిసరాలన్నీ ఎర్త్ షాక్ కొట్టినట్లు చెబుతున్నారు. ఆ పరిసరాల్లోనే ఇప్పుడూ షాక్ కొట్టడంతో అక్కడే ఉన్న ఆవు మృతి చెందింది. ఇటీవల ఎస్‌బిఐ ఎటిఎం వారు ఎర్త్ లైను భూమిలో పాతకుండా బయటే వదిలేయడంతో పూర్తిగా పరిసరాలు అన్ని వర్షం నీటితో నిండిపోవడంతో షాక్ కొడుతోంది. ఎలక్ట్రికల్, పశుసంవర్ధక సిబ్బంది సహాయక చర్యలు చేపడుతున్నారు.

వర్షాలు కురుస్తున్నా రక్షణ గోడలేవీ?

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజనులు సాధారణంగా ఎత్తైన కొండలపై ఆవాసాలు ఏర్పర్చుకుంటారు. ఎందుకంటే వారి జీవనం కొండలపై ఇముడి ఉంటుంది. వ్యవసాయం, అటవీ ఉత్పత్తులు సేకరిస్తూ సమీపంలోనే ఆవాసాలు ఏర్పర్చుకుంటారు. ఇక వర్షాకాలంలో కొండలపై నుంచి వరద నీరు కొండల మీదుగా నేరుగా గ్రామాల్లోని ఇళ్లలోపలికి చొచ్చుకుపోతుంది. దీంతో గిరిజనులకు ఇబ్బందులు తప్పడం లేదు. సీతంపేట ఏజెన్సీలో సుమారు 500 గిరిజన గ్రామాలు ఉన్నాయి. వీటిలో చాలా గ్రామాలకు వరద గోడల్లేవు. వీటిలో ధారపాడు పంచాయతీలో రామానగరం కాలనీ, రామానగరం, పెద్దగూడ, ఈతమానుగూడ, దబర, కోసంగి, బూర్జి గూడ, వీరఘట్టం పంచాయతీలో కోతుల వీరఘట్టం, నిమ్మలవలస, కిల్లాడ పంచాయతీలో దంజుపాయి, తాడిపాయి పంచాయతీలో పొంగలం గూడ, జలుబుగూడ, జయపురం గూడ, నాయకమ్మ గూడ పంచాయతీలో చాపరాయిగూడ, మర్రిమాను గూడ, దుగ్గి పంచాయతీలో గడ్డికారం, రాయిలంక, దుగ్గి, టిటుకుపాయి పంచాయతీలో టిటికపాయిగూడ, కుసుమూరు, అంబల గండి, తుంబకొండ పంచాయతీలో సంధిగూడ, రాయి కురిడి, జల్లారగూడ, దాసు గుమ్మడ వద్ద గతంలో గొయ్యి తీసి సగం చేసి పనులు వదిలేశారు.

పివి ఈతమానగూడ పంచాయతీలో కొత్తగూడ, డుంబంగివలస, ఎగువ డుంబంగివలస, దిగువ డుంబంగా వలసలో పాటు అనేక పంచాయతీలకు వరద గోడ లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. వరద గోడలు లేకపోవడంతో గతంలో ఇంటిపై వరద నీటి పడి గోడలు బాగా నానిపోయి బట్టలు, తడిచి వస్తువులు తడిచేపోయాయి. అంతేకాకుండా వ్యాధులు కూడా సంభవించాయి. గతంలో వరదలకు వర్షపు నీరు రావటంతో దోనుబాయి, పల్లంకి, దాసుగుమ్మడలో కోళ్లు మృతి చెందాయి. గోడలు తడిసి ఇల్లు కూరిపోయాయి. వరద నీరు మళ్లించడానికి వరద గోడ మంజూరు చేయాలని గిరిజనులు అధికారులకు వినతులు సమర్పిస్తున్నా ఇంత వరకూ చర్యలు తీసుకోలేదు. ఈ ఏడాది వర్షాలు అధికంగా ఉంటాయని, అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. కావున సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే వరద రక్షణ గోడలు నిర్మించాలని కోరుతున్నారు.

ఆందోళనలో ఆదివాసీలు

గోడలేని అంబలగండి గ్రామం

ఇబ్బందులు పడుతున్నాం

వర్షాకాలంలో వర్షపు నీరు కొండపై నుంచి ఏకంగా ఇంటిలోకే వరద వచ్చేస్తుంది. దీంతో గోడలు మెత్తగా తడిసిపోవడంతో పాటు ఇళ్లలోని వస్తువులన్నీ తడిసి ముద్దవుతున్నాయి. మళ్లీ ఎండ కాసినప్పుడు ఆరబెట్టుకోవాల్సి వస్తుంది. గోడలు తడిసిపోవడంతో ఆ చల్లదనంతో నిద్ర పట్టడంలేదు.

పత్తిక సంజీవరావు, గిరిజనులు, ఈతమానుగూడ .

గత ఏడాది కొన్ని పూర్తి చేశాం

గత ఏడాది మార్చిలో సిసిడిపి నిధులతో కొన్ని వరద గోడలు పూర్తి చేశాం. ఈ ఏడాది మిగతా వరద గోడలు పూర్తి చేస్తాం.

పి. రమాదేవి, ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, సీతంపేట.

తాళం వేసి ఉన్న రైతు సేవా కేంద్రం

రైతు సేవా కేంద్రానికి తాళం

ప్రజాశక్తి- సీతంపేట

సీతంపేట ఐటిడిఎ సమీపంలో ఉన్న రైతు సేవా కేంద్రం, వ్యవసాయాధికారి కార్యాలయానికి గురువారం తాళాలు వేసి దర్శనమిచ్చాయి. రైతులకు నిరంతరం అందుబాటులో ఉండి సేవలు అందించవలసిన రైతు సేవా కేంద్రం తాళాలు వేసి ఉంటే ఎలా అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీతంపేట ఐటిడిఎ ఎదురుగా ఉన్న రైతు సేవా కేంద్రానికి తాళాలు వేసి ఉండడం గమనార్హం. మరో పక్షంలో ఖరీఫ్‌కు రైతు సన్నద్ధమవుతున్న తరుణంలో ఇటీవల కురిసిన వర్షాలకు దుక్కులు కూడా ప్రారంభించారు. ఇలాంటి సమయంలో రైతులకు సూచనలు సలహాలతో పాటు విత్తనాలు, ఎరువులను అందించాల్సిన రైతు సేవా కేంద్రం మూసి ఉండడంతో రైతులు వచ్చి చూసి నిరాశతో వెను తిరిగారు. విత్తనాల కోసం రైతుల పేర్లు నమోదు వంటివి కార్యక్రమాలు రైతు సేవా కేంద్రంలోని జరగాల్సి ఉంది. దీనిపై వ్యవసాయ అధికారి కె మన్మధరావు వద్ద ప్రస్తావించగా కౌన్సిలింగ్‌కి వచ్చామని సమాధానం ఇచ్చారు.

తెలుగుజాతి ఉన్నంత వరకూ ప్రజాదరణ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

తెలుగు జాతి ఉన్నంత వరకూ టిడిపికి తిరుగులేని ప్రజాదరణ ఉంటుందని ఎపి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఉద్ఘాటించారు. పార్వతీపురం జిల్లా కేంద్రంలోని సౌందర్య థియేటర్ హాల్లో స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర ఆధ్వర్యంలో టిడిపి అరుకు పార్లమెంట్ జిల్లా మినీ మహానాడు గురువారం వైభవంగా జరిగింది. అరకు పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు కిలారి శ్రావణ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, పార్టీ పరిశీలకులు హర్ష కుమార్, కురుపాం, రంపచోడవరం ఎమ్మెల్యేలు జగదీశ్వరి శిరీష దేవి, వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నాయకులు భంజదేవ్, వినీష్, గిడ్డి ఈశ్వరి, పడాల భూదేవి తదితరులు ముందుగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి వెన్నుముక అని, నాలుగు దశాబ్దాలుగా పార్టీ వెన్నంటే ఉండి విజయాలు అందిస్తున్నారని వారి కృషి మరువలేమని స్పష్టం చేశారు. పరిశీలకులు హర్షవర్ధన్, అరకు పార్లమెంటు ఇంచార్జ్ కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో టిడిపి నాయకులు కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని అయినా పార్టీ కోసం కష్టపడి పని చేశారని, అటువంటి వారిని పార్టీ ఎప్పటికీ మరిచిపోదని, స్థానిక నాయకులు వారికి అండగా ఉండాలని సూచించారు. ఎమ్మెల్యే విజయచంద్ర మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకు తాను అండగా ఉంటానని, ఎవరైనా టిడిపి కార్యకర్తను టచ్ చేయాలంటే ముందుగా తనను టచ్ చేయాలని హెచ్చరించారు. ఎమ్మెల్యేలు జగదీశ్వరి, శిరీష దేవి తదితరులు మాట్లాడుతూ పార్టీ అధికారంలోకి వచ్చాక తొలిసారిగా పార్లమెంట్ స్థాయి మహానాడు పార్వతీపురం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో విజయవంతంగా జరగడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంటు నియోజకవర్గాల నుంచి నాయకులు, కార్యకర్తలు, ఇంఛార్జిలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

మంత్రి గుమ్మడి సంధ్యారాణి

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

గిరిజన మహిళలే బ్రాండ్ అంబాసిడర్లు

ప్రజాశక్తి- పాచిపెంట

వ్యవసాయ రంగంలో నేటి గిరిజన మహిళలు విత్తనం వేసిన దగ్గర నుండి కోత కోసే వరకు ప్రతి దశలోనూ తమ పనితీరును కనబరుస్తూ అధిక దిగుబడును సాధించడానికి కృషి చేస్తున్నారని వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. జీలుగువలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిఆర్‌పి కొండేటి సురేష్ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ తిరుపతిరావు మాట్లాడుతూ గిరిజన మహిళలే ప్రకృతి సేద్యానికి బ్రాండ్ అంబాసిడర్లు అని ఈ ఖరీఫ్ సీజన్‌లో పెద్ద ఎత్తున ప్రకృతి సేద్యాన్ని విస్తరించాలంటే గిరిజన మహిళల సహకారం లేకుండా సాధ్యం కాదని తెలిపారు. గిరిజన రైతులు గిరిజన సాంప్రదాయ పంటలైన చిరుధాన్యాల సాగును మరింతగా విస్తృతం చేయాలని ప్రభుత్వం మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తుందని చిరుధాన్యాల విత్తనాలు 90 శాతం రాయితీపై అందిస్తున్నామని తెలిపారు. గట్లపై కంది కూరగాయలు వంటి వాటిని పండించుకోవాలని ఏక పంట కాకుండా అంతర పంటలు వేసుకోవాలని ఈ విషయమై మన పక్కనే ఉన్న రెట్లపాడు గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవలసిన చెప్పారు. సర్పంచ్ ముఖి ఆనందరావు మాట్లాడుతూ కంది చిరుధాన్యాలు, వరి విత్తనాలు త్వరగా అందించాలని కోరారు. తంగలాం గ్రామ పెద్ద సారా రాజు గిరిజన భాషలో ప్రకృతి సేద్య ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ప్రకృతి సేద్యానికి ప్రోత్సాహాన్ని అందించాలని కోరుతూ గ్రామ పెద్దలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి సేద్య ఐ సిఆర్‌పిలు చదల రాజు, అప్పన్న గ్రామ వ్యవసాయ సహాయకులు కిరణ్, రైతులు పాల్గొన్నారు.

రైతులను సత్కరిస్తున్న ఎఒ తిరుపతిరావు

ఎపి ట్రైబల్ అడ్వైజరీ కమిటీ మెంబర్లుగా నలుగురు ఎంపిక

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ అడ్వైజరీ కమిటీ (టిఎసి) మెంబర్‌గా విశ్రాంత గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షులు నందివాడ కృష్ణబాబు ఎన్నికయ్యారు. ఈయన ప్రస్తుతం టిడిపి అరకు పార్లమెంట్ ఎస్టీ సెల్ అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నారు. తనకు ట్రైబల్ అడ్వైజర్ కమిటీ మెంబర్‌గా ప్రభుత్వం నియమించడం పట్ల సిఎం చంద్రబాబు, మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి అభినందనలు తెలిపారు.

పాలకొండ: ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ అడ్వైజర్ కౌన్సిల్ సభ్యులుగా స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి మోజోరు తేజోవతి నియమితులయ్యారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి చైర్మన్‌గా, ఎస్సీ, ఎస్టీ సభ్యులుగా 16 మందిని నియమించింది. ఈ కమిటీలో వీరిద్దరికి ప్రాధాన్యత కల్పించింది.

సీతంపేట: ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ రాష్ట్ర అడ్వైజర్ కమిటీ సభ్యునిగా టిఎంసి సవర మాలయ్య ఎంపికయ్యారు. కోడిశ పంచాయతీ బిల్లగూడ గ్రామానికి చెందిన ఈయన మాజీ ఎంపిపిగా, అరకు పార్లమెంటు ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.

ఎమ్మెల్యే జయకృష్ణ

కృష్ణబాబు, తేజోవతి

కుడుమూరు భూములకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి- పాచిపెంట

సర్వేనెంబర్ 48లో 782 ఎకరాలు కుడుమూరు భూములకు పట్టాలు మంజూరు చేయాలని ఒడిశల మడ జంక్షన్ వద్ద గురువారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం సీనియర్ నాయకులు సూకురు అప్పలస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ తాతల కాలం నుండి సాగు చేస్తున్న గిరిజనుల భూములకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపడతామని హెచ్చరించారు. పట్టాలు ఇవ్వకపోవడం వల్ల భూములు అన్యాక్రాంతం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. పట్టాలు మంజూరు చేసే వరకు ఐక్యంగా ఉండాలని పోరాడాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ ఈ భూములను ఆక్రమించుకోవడానికి అనేకమంది ప్రయత్నం చేస్తున్నారని వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి సాగు చేస్తున్న 48 సర్వేనెంబర్ 782 ఎకరాలు భూములకు పట్టాల మంజూరు చేసి గిరిజనులకు ఆదుకోవాలని కోరారు. ప్రతిపక్షంగా ఉండే సందర్భంలో ప్రస్తుత మంత్రి సంధ్యారాణి గిరిజనులకు అండగా ఉంటానని చెప్పి నేడు ఈ సమస్య పరిష్కారం చేసేందుకు ముందుకు రావడం లేదని అన్నారు. కాలయాపన చేయకుండా గతంలో సర్వే చేసిన వివరాలు బహిర్గతం చేయాలని వెంటనే పట్టాలు మంజూరు చేసి సాగులో ఉన్న గిరిజనుల ఆదుకోవాలని గిరిజనులకు సిపిఎం అండగా ఉంటుందని తెలిపారు. గిరిజనులంతా ఐక్యంగా తమ భూములు సాధన కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు కొర్ర కళ్యాణ్, గమ్మెల గోపాల్, భీమారావు, తాడియ్యా, సొయ్యారు సోమయ్య, కొర్ర రాజేష్, సూపర్ ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న గిరిజన రైతులు, నాయకులు

వ్యాధులపై అవగాహన ర్యాలీలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

గర్భిణీల్లో ప్రీ-ఎక్లంప్సియా ఒక ప్రమాదకర సూచికని, సకాలంలో లక్షణాలు గుర్తించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు సూచించారు. ప్రపంచ ప్రీ - ఎక్లంప్సియా దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య కార్యాలయం ప్రాంగణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ గర్భిణుల సమయంలో హైరిస్క్ సమస్యలు ముందస్తుగా గుర్తించాలని ఇందులో ప్రీ ఎక్లంప్సియా ఒక ప్రమాదకర సూచికని, లక్షణాలతో ముందస్తుగానే గుర్తించి తగు చికిత్స,పర్యవేక్షణ తప్పనిసరి అని సూచించారు. బిపి అధికంగా ఉండటం (140/90 పైన), తీవ్రమైన తలనొప్పి, దృష్టి సమస్య, ముఖం, చేతులు, కాళ్లు ఉబ్బడం, మూత్ర విసర్జన తగ్గడం, ఎపిగ్యాస్ట్రిక్ నొప్పి లక్షణాల ద్వారా గుర్తించాలన్నారు. బిపి ఖచ్చితంగా నమోదు చేస్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని, యూరిన్ అల్బుమిన్ పరీక్షా నివేదికలు పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి. జగన్మోహనరావు, డాక్టర్ పిఎల్ రఘుకుమార్, డిపిహెచ్ఎన్ఒ ఉషారాణి, డిపిఒ లీలారాణి, కార్యాలయ సూపరింటెండెంట్ కామేశ్వరరావు, డిసిఎం విజయలత, సిసి శ్రీనివాసరావు, వైద్య మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బందలుప్పిలో... మండలం లోని బందలుప్పి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ తిరుమల ప్రసాద్, శ్రీకాంత్ ప్రీ-ఎక్లంప్సియాపై మహిళలకు అవగాహన కల్పించారు. అవగాహన కల్పించారు. గర్భిణులను ముందస్తుగా గుర్తిస్తే చికిత్స చేయించుకోవడానికి, ప్రమాదాలను తగ్గించడానికి వీలుంటుందన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదించడం, సరైన ఆహారం తీసుకోవడం, ధూమపానం చేయకపోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రీ-ఎక్లంప్సియా నిర్ధారణ అయిన వెంటనే, తక్షణమే చికిత్స చేయించడం చాలా ముఖ్యమని, చికిత్స ద్వారా తల్లీబిడ్డ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్ జయగౌడ్, నాగమ్మ ,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గరుగుబిల్లి : ప్రపంచ ప్రీ-ఎక్లంప్సియా దినోత్సవం సందర్భంగా స్థానిక పిహెచ్‌సి వైద్యాకాధికారి డాక్టర్ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ చిన్నమ్మి, రవణమ్మ, ఉదయ్ కుమారి, దుర్గాప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు

భామిని : ప్రపంచ ప్రీ-ఎక్లంప్సియా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని బత్తిలి పిహెచ్‌సి వైద్యులు కొండపల్లి రవీంద్ర ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, అన్ని హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో ప్రీఎక్లంప్సియాపై అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న డిఎంఅండ్‌హెచ్ఒ భాస్కరరావు, తదితరులు

తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఎండియు ఆపరేటర్లు

ఎండియు వాహనాలు రద్దు సరైనది కాదు

ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కితీసుకోవాలి : ఆపరేటర్లు

ప్రజాశక్తి - పాలకొండ

ఎండియు వాహనాలు రద్దు అన్న నిర్ణయంపై 18,500 కుటుంబాలు రోడ్డున పడ్డాయని, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని ఎండియు ఆపరేటర్ల అసోసియేషన్ అధ్యక్షులు మన్మధరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎండియు ఆపరేటర్లతో కలిసి ధర్నా, నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 28 మాసాలుగా అంగన్వాడీ, మిడ్ డే మిల్స్ బకాయిలు వెంటనే రిలీజ్ చేయాలన్నారు. గత నెల తమ ఇన్సూరెన్స్ అమౌంట్ రూ.9వేలు తమ వ్యక్తిగత ఖాతాలను కట్ చేశారని, వెంటనే ఆ అమౌంట్‌ను తమకు జమ చేయాలని డిమాండ్ చేశారు. 2027 జనవరి వరకు అగ్రిమెంట్ ఉన్న తమ వాహనాలకు బ్యాంకు లావాదేవీలు ప్రభుత్వం వారిచే ఎన్‌ఒసి ఇప్పించి తమకు న్యాయ పరంగా సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎండియు ఆపరేటర్లు ప్రశాంత్, రమణ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

28న ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - పాలకొండ

తోటపల్లి ఎడమ కాలువ భూములకు సాగునీరందించాలని కోరుతూ ఈనెల 28న సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్నట్లు ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు అన్నారు. మండలంలోని కోటిపల్లిలో ధర్నాకు సంబంధించిన పోస్టరు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక శ్రీ కోట దుర్గ ఆలయం నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకూ ప్రదర్శన, అనంతరం అక్కడ జరుగుతుందన్నారు. తోటపల్లి బ్యారేజ్ ఎడమ కాలువ ద్వారా మండలంలో సుమారు 25 గ్రామాలకు సాగునీరందడం లేదన్నారు. కొన్ని ప్రాంతాలకు మొదటి పంటకు కూడా నీరందడం లేదన్నారు. రెండో పంటకు నీరందేలా చర్యలు చేపట్టాలన్నారు. తోటపల్లి ఆయకట్టు రైతులు మే 6న సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చినప్పటికీ నేటికీ అధికార యంత్రాంగంలో కదిలి లేదన్నారు. దీంతో ఈనెల 28లోపు తోటపల్లి ఎడమ కాలువ ఆయకొట్టు రైతులకు సాగునీరు అందించే చర్యలు నిర్దిష్టమైన ప్రతిపాదనలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాజకీయాలకు అతీతంగా ఈనెల 28న రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా జరుగుతుందన్నారు. ఈ ధర్నాకు రైతులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బెజ్జిపురం లక్ష్మణనాయుడు, తోటపల్లి ఆయకట్టు రైతులు మజ్జి చిట్టిబాబు, ఆగూరు విశ్వేశ్వరరావు, రాంబాబు, పి.నరసింహనాయుడు, టి.తవుడు, శంకర్రావు, ఎస్.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టెండరు నోటీసు :: పాలకొండ నగర పంచాయితీ

ఆర్.సి. నెం: 514/2023-ఇ1, తేది:22-05-2025

పాలకొండ నగర పంచాయితీకి చెందిన ఈ దిగువ తెలిపిన పనుల కొరకు ఇ-ప్రొక్యూర్మెంట్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి.

1	15వ ఆర్థిక సంఘం నిధులు (1 పని)	అంచనా కాంట్రాక్ట్ విలువ రూ:11,58,928/-
2	సాధారణ నిధులు, 2025-2026, (7 పనులు)	రూ:21,92,377/-
బిడ్ డౌన్ లోడ్ ప్రారంభ తేది & సమయం		23-05-2025, 10.00 AM
బిడ్ డౌన్ లోడ్ ఆఖరి తేది / బిడ్ సమర్పించుటకు ముగింపు తేదీ & సమయం		29-5-2025 & 6-6-2025 5.00 PM
ప్రైస్ బిడ్ తెరుచు తేది & సమయం		29-5-2025 & 6-6-2025 5.05 PM

ఇతర వివరములకు కాంటాక్ట్ నెం: 9849944772కు సంప్రదించి తెలుసుకోవచ్చును.

కమిషనర్
పాలకొండ నగర పంచాయితీ